దేశంలోని దర్జీలంతా రకరకాల దుస్తులని కుట్టి పోటీ జరిగే రోజు రాజ సభకి హాజరయ్యారు. వారు కుట్టినవన్నీ ఒకదాంతో మరొకటి పోటీ పడేలా అద్భుతంగా వున్నాయి. ఓ ముసలి దర్జీ మాత్రం ఉత్త చేతులతో వచ్చాడు. అతని వంతు రాగానే, ఖాళీ చేతులతో వచ్చిన ఆ దర్జీని చూసి రాజు అడిగాడు.

"పోటీకి వచ్చినట్లున్నావు?"

"అవునండి." వినయంగా జవాబు చెప్పాడు ఆయన.

"మరి దుస్తులని తేలేదే?"

"అవి కంటికి కనపడేవి కావు రాజా! దయ అనే బట్టని, ఇతరుల పట్ల మృదుత్వం అనే దారంతో సహనం అనే గుండీలతో కుట్టిన ఆ దుస్తులని ధరించి సేవ అనే తాడుతో జారి పోకుండా కట్టుకోవాలి. అవే ఏ మనిషికైనా నిజమైన అలంకారాలు."

రాజు ఆ దర్జీ వాడికి ప్రథమ బహుమతిని ఇచ్చాడు.

## 19. సాధుత్వం

ఓ సంచార గురువు చీకటి పడుతూండగా తన శిష్యుడితో ఓ గ్రామానికి చేరుకున్నాడు. అక్కడ గుళ్ళో విశ్రమిద్దామనుకున్నాడు కాని గుడి అర్చకుడు వాళ్ళని అందుకు అనుమతించలేదు.

"మీరు విగ్రహాలకున్న బంగారు నగలని కాజేసే దొంగల్లా ఉన్నారు." కసురుతూ చెప్పాడు.

వాళ్ళకి ఆ గ్రామంలో ఎవరూ భిక్ష ఇవ్వలేదు.

"మీరిద్దరూ దొంగ సాధువుల్లా ఉన్నారు. తెల్లారాక మా గ్రామం విడిచి వెళ్ళిపోండి." హెచ్చరించారు వాళ్ళు.

మర్నాడు పొద్దున్న వారు ఆ గ్రామం విడిచి వెళుతూండగా ఓ గ్రామస్థుడు ఎదురు పడ్డాడు. వాడు వెంటనే ఆ ఇద్దరి మీదా ఉమ్మేసి కోపంగా అరిచాడు.

"వెధవల్లారా! పొద్దున్నే మీ మొహం చూసాను. ఈ రోజు ఏం కీడు రానున్నదో నాకు."

"మీ గ్రామస్థులంతా పరమ దుర్మార్గులు. మీరు నాశనం అవుగాక." శాపనార్థాలు పెట్టాడు శిష్యుడు.

గ్రామంలోంచి బయటకి వచ్చాక తన గురువు బాధపడుతూండటం చూసి, జరిగిందానికి ఇంకా ఎక్కువ బాధపడే శిష్యుడు అనునయంగా చెప్పాడు.

"బాధపడకండి గురువు గారు. ఈ గ్రామస్థులు సంస్కారవంతులు కారు. పైగా మూర్ఖులు."

"నేను బాధపడేది వాళ్ళ గురించి కాదు. నువ్వు నా దగ్గర ఇంతకాలంగా ఉండీ, నా బోధనలని వినీ, ఇంకా సాధుత్వం అలవరచుకోనందుకు బాధ పడుతున్నాను." చెప్పాడు సంచార గురువు.

## 20. పాఠం

ఓ తండ్రీ కొడుకులిద్దరూ ఒకరికి మించిన లోభులు మరొకరు. ఇతరులకి సహాయం చేయడం లాంటి దైవీ గుణాలు వారిద్దరిలో లేవు. ఓరోజు వాళ్ళింటికి భిక్షకి ఓ సన్న్యాసి వెళ్తూంటే వూళ్ళోవాళ్ళు ఆయన్ని వాళ్ళింటికి వెళ్ళద్దని, ఆ తండ్రీ కొడుకుల లోభత్వం గురించి చెప్పారు. అతను వాళ్ళ ఇంటి ముందు ఆగి తాగడానికి కాసిన్ని మంచినీళ్ళు ఇవ్వమని కోరితే 'చెఱువు దగ్గరకి వెళ్ళి తాగు' అన్నాడు తండ్రి.

సన్న్యాసి కొడుకుని పిలిచి చెప్పాడు.

"మరో మూడు రోజుల్లో నీ తండ్రి మరణిస్తాడు. అతన్ని కాల్చాక నువ్వు నీ తండ్రి పుర్రెని తీసుకుని దాన్ని పాత్రగా చేసుకుని అందులో డబ్బు దాచుకో. బాగు పడతావు."

ఆ సన్న్యాసి చెప్పినట్లే తండ్రి మూడో రోజు మరణించాడు. దాంతో సన్న్యాసి మాటల్లో నమ్మకం కుదిరిన కొడుకు తండ్రి పుర్రెని తెచ్చుకుని దాన్ని శుభ్రం చేసి డబ్బులుంచుకునే పాత్రగా చేసుకుని వాడుకోసాగాడు. దాంట్లో డబ్బు వేయడమే తప్ప లోభి కాబట్టి కొడుకు డబ్బుని తీసేవాడు కాదు. ఐతే ఎంత డబ్బు వేసినా ఆ పుర్రె పాత్ర నిండకపోవడం కొద్ది కాలంలో కొడుకు గుర్తించాడు.